# కిటికీల మధ్య

'భావశ్రీ'

అబ్బాయి కాలేజీ చదువుకోసం పట్నంలో రూమ్ తీసుకున్నాడు.

అతని రూమ్ కిటికీ కెదురుగా పదిగజాల దూరంలో మరోయింటి కిటికీ!..

ఈకిటికీలోంచి చూస్తే అగదిలోని అమ్మాయి కన్పిస్తుంది!...

ఆకిటికీలోంచి చూస్తే యీగదిలోని అబ్బాయి కన్పిస్తాడు!....

* * *

ఆ అమ్మాయి (తనలో)

ఎవడో ఆ పోకిరీ వెధవ? నెల్లాళ్ళయి వచ్చాడు ఎదురింటి రూములోకి. చూడగా కొంప లార్పే ఘనుడులా గున్నాడు!

వాడి మొహం చూస్తే అసహ్యం వేస్తోంది. వాడికేం పనిలేనట్టుంది. ఎప్పుడూ ఆ కిటికీ దగ్గరనే కుర్చీ వేసుకుని కూర్చుంటాడు వెధవ వేషాలూ, వాడూనూ!

ఏదో పుస్తకం చేత్తోపట్టుకుని చదువుతున్నట్టు నటిస్తూంటాడు దొంగవెధవ.

చూడగా కాలేజీ స్టూడెంటు లాగున్నాడు. అయితే నా ప్రాణంమీది కొచ్చిందన్నమాటే!

తలదువ్వు కుందామని కిటికీ దగ్గరకి నేను రా భయం అంతకముందు ఏదో పుస్తకం చదువుతున్నవాడల్లా, పాములా పసిగట్టి చటుక్కున తలపైకెత్తి కిటికీలోంచి నామొహం వేపు ఎగాదిగా చూస్తూంటాడు. అడుక్కుతిని పోతాడు వెధవ!...

అదిగో! వెధవన్నర వెధవ మళ్ళీ తలెత్తి నావైపు తీక్షణంగా చూస్తున్నాడు. బాగా దేహశుద్ధి చేస్తే సరి రోగం కుదురుతుంది. లేకపోతే పరస్త్రీ, అందులో సంసార స్త్రీవైపు అలా చూస్తాడా?

నన్నేమన్నా "బోగంది" అనుకున్నాడా? వెధవ. వాడి పని పట్టాలి ..

మొన్నటికిమటుక్కు మొన్న అచ్చమ్మ గారింటికి పనుండి వెళ్ళుదామని వీధిలోకి వచ్చి నాలుగడుగులు వేసేటప్పటికి, ఎలా పసిగట్టాడో ఏమో, వాడూ తన గదికి తాళంవేసి నాపు ఎదురుబడ్డాడు. నాకప్పుడు గుండె జల్లుమందెందు చేతనో! తనకు మర్యాద తెలియనప్పుడు నేను కూడ తనలాగే మానమర్యాద లేకుండా ప్రవర్తించాలనేనా అతని ఉద్దేశ్యం? వెధవ! చచ్చేటప్పుడు పక్షవాతం పడిపోతాడులే!....

వీడి చేష్టలు రోజు రోజుకీ శృతి మించి రాగాన్ని పడుతున్నాయ్! మొన్నటి రోజున వలుగురు స్నేహితుల్ని ప్రోగుచేసుకు వచ్చాడు నాగురించి ఏదో గుస గుసలాడుకొని పొట్టచెక్కలయ్యేట్టు నవ్వుకున్నారారోజంతా. నన్ను కవ్వించటానికి ఆ కిటికీ ముందు కూర్చుని గోలచేశాడు వెధవలు! అర్ధాయుష్షు వెధవలు!

ఈ మహానగరంలో యింతమంది పోలీసు లుండి ఏంప్రయోజనం?

ఇలాటి దుర్మార్గుల్ని అరెస్టు చేసి జైలులో పడెయ్యక ఎందుకు విడిచిపెడుతుందో ప్రభుత్వం?

నా కింకే దారిలేదా భగవాన్? నీ పాదాలకి మొక్కుతాను నీటముంచకు నన్ను! పాలముంచు తండ్రీ!

ఆరౌడీ వెధవ ఆరూమ్ నుండి వెళ్ళేట్టు చెయ్యి భగవాన్! వాడు నావైపు ఎగాదిగా చూస్తూంటే నాప్రాణాలుఎగిరి పోతున్నాయి ప్రభూ!

తిరుపతి వెంకటేశ్వరస్వామీ! నన్ను పాలముంచు తండ్రీ! నీకు మూడురూపాయల ముడుపు చెల్లించుకుంటాను.

* * *

ఆ అబ్బాయి (తనలో).-

ఎవరీ అమ్మాయి.

నెల్లాళ్ళనుంచీ చూస్తున్నాను ఆమె తరహా. ఎందుకలా నా వైపు చూస్తూంటుంది రెప్పవాల్చకుండా?

ఎప్పుడూ ఆ కిటికీముందు కూర్చుని తలదువ్వుకుంటున్నట్లో, ఏదో నటిస్తుంటుంది-మొత్తానికి నెల్లూరు నెరజాణామనిషి! దీని ముఖంచూస్తేనే పాపా అంటుకుంటాయ్! చీ! అందుకోసమే పట్నంలో ఉండక్కూడదు. అందులో నా లాటి నీతిమంతుడు అసలే పట్నంలో ఉండకూడదు! అహా! ఎంత చెడిపోయింది స్త్రీ లోకం?

అవధాన్లుగారు అబద్ధం ఆడతారా? అప్పుడే చెప్పారు "ఏమోయ్ చదువుకోసం పట్నంపోతున్నావల్లే ఉంది. జాగ్రత్త నాయనా! వలలుంటాయి అక్కడ. వలలో పడకుండా క్షేమంగావచ్చి మీ నాన్నగారి పరువు నిలబెట్టు" అని చెప్పారు. ఆయన చెప్పినట్లునే నీ వలలో పడటానికి వీల్లేదు!

ముమ్మాటికీ వీల్లేదు?

అదిగో! మళ్లీనావైపు రెప్పవెయ్యకుండా చూస్తోంది మానమర్యాదలు తెలియని అభిసారిక!

మొన్నటిరోజున మాత్రం నాకు అరికాలి మంట నెత్తికెక్కింది. మరి ఎక్కడూ దాని చేష్టలు చూస్తూంటే?

రూము తాళంవేసి కాలేజీకని బయల్దేరి నాల్గడుగులు వేశానో లేదో-అప్పుడే ఎలా తెలిసిందో ఏమిటో నా ఎదురుగా ప్రత్యక్షమయింది కోపంతో మండిపోతూ. అవును! కోపం కాదూ! తన అభీష్టాన్ని నెరవేర్చలేదనేగా ఆమె కోపం? పోనీలే నన్నేం చెయ్యగలదు తన కోపం?

దీని చేష్టలు చూస్తూంటే పరమ అసహ్యం వేస్తోంది, మొన్నటిరోజున నలుగురు స్నేహితులూ నేనూ రూములో కూర్చుని కాలేజి విషయాలు ముచ్చటించుకొని విరగబడి నవ్వుకుంటూంటే ఆమె ఓర్వలేక ఆ కిటికీలోంచి తుపుక్ మని ఉమ్మి కళ్ళనుండి అగ్నిని కురిపించింది.

ఆ ఓర్వలేని తనం నా కర్థంకాకపోలేదు, యౌవ్వనంలో ఉన్న నావంటి సుందరిని త్రోసిపుచ్చి దమ్మిడీకి కొరగాని వెధవలతో ముచ్చటిస్తున్నావా? అన్నట్లుగాచూచిందికోపంగా.

ఎలాగైనా త్వరలో మరోరూమ్ చూసుకోటం ఉత్తమమైన మార్గం....

అసలి లాంటి అభిసారికల్ని చూస్తూంటే నాకు తలమంట తోకకివస్తుంది.

చూస్తే సంసారం చేస్తున్న మనిషిలాలేదు. చీ! దాని మొహం చూడకూడదు.

ఎంతచూడకుండా ఉందామనుకున్నా యీ గదికి యీ ఒక్కకిటికీ తప్ప మరోకిటికీ ఆయినా తగలడలేదు నాఖర్మకొద్దీ.

పోనీ కిటికీలే మూసేద్దామంటే గాలివచ్చే దిక్కేలేదు పోనీ చూడటం మానేద్దామంటే, ఎంత చూడకుండా ఉందామన్నా తలెత్తకుండా ఎలా ఉండటం

తలెత్తితే దర్శనం!...ఏమిటి కర్తవ్యం?

ఆ గదినుండి అదిపోతే దేవుడికి యిరవై కొబ్బరికాయలు కొట్టుకుంటాను.

భగవాన్! అదెవ్వతో మానమర్యాదలులేని నా వైపు అదోలా చూస్తుంటేనాకు అసహ్యం వేస్తోంది. పైగా అవమానకరంగా కూడా ఉంది.

నేను నీతిమంతుడ్ని-పెద్దమనిషిని-మర్యాదగా బ్రతికేవాడ్ని. మావంశం పేరు ప్రతిష్ఠలు నీకు తెలియనివికావు భగవాన్! దాన్ని ఆయింటి నుండి పోయేట్టు చెయ్యితండ్రీ! లేదా ఆ కిటికీ తలుపులు మూయించు భగవాన్!

మంగళగిరి నరశింహస్వామీ! నీకు సహస్ర నామార్చన చేసుకుంటాను

వారంరోజులు గడిచింది.

ఆ కిటికీ తలుపులు మూసుకున్నాయి. ఈగది తలుపులకు తాళం వెయ్యబడి వుంది.

అతని బుర్ర చెడిపోవడంవల్ల విశ్రాంతికై తన ఊరు పోదామనుకున్నాడు

ఆమె బుర్రకూడ ఇంచుమించుచెడి పోయింది. పుట్టింటికి బయలుదేరింది

రైలు బయలుదేరింది ఒకేకంపార్టుమెంటులో యెక్కినవాళ్ళిద్దరిచూపులుఅప్రయత్నంగాకలిశాయ్

హృదయాలలో తుఫాన్ చెలరేగింది ఉద్వేగంతో వణికిపోయారిద్దరూ!